క్లుప్తంగా

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ అడ్మిషన్ల జిల్లా కన్వీనర్ ఎం.వేణుగోపాల వర్మ గురువారం తెలిపారు. కాకినాడ, కోనసీమ జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ఆన్‌లైన్ సెంటర్ ద్వారా జూన్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజనల్ ధ్రువ పత్రాలు కాకినాడ ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. ఏమైనా సందేహాలుంటే 0884-2348182 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

శిరిడీ సాయికి ప్రత్యేక పూజలు



గురజనాపల్లిలోని బాబా

కరప: మండలంలోని సిరిపురం, వేములవాడ, వేళంగి, నడకుదురు, గురజనాపల్లి, కొరిపల్లి, కరప, గొడ్డటిపాలెం తదితర గ్రామాల్లోని షిరిడిసాయిబాబా మందిరాలలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురజనాపల్లిలో ఆలయ వ్యవస్థాపకుడు కర్నాసుల శివకుమార్, సిరిపురంలో ఆలయ వ్యవస్థాపకుడు చిక్కాల దొరబాబు సోదరులు ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు నిర్వహించారు.

చిన్నారి గుండె శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం



బాలిక తల్లిదండ్రులకు చెక్కు అందజేస్తున్న సతీష్

కాకినాడ క్రైం: కాకినాడకు చెందిన 9 ఏళ్ల చిన్నారి గుండె శస్త్రచికిత్సకు శ్రీ యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ గురువారం ఆర్థిక సాయం అందించింది. రేచర్లపేటకు చెందిన శ్రీనాథ్, శ్రావణి దంపతుల కుమార్తె మధుప్రియకు రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ చెక్‌ను సంస్థ వ్యవస్థాపకుడు బొల్లం సతీష్ వారికి గ్లాస్ హౌస్ సెంటర్‌లోని కార్యాలయంలో అందజేశారు.

ఉత్సాహంగా వేసవి వినోదం



వేసవి వినోదంలో పాల్గొన్న విద్యార్థులు

కాకినాడ సిటీ: జనవిజ్ఞాన వేదిక నగర శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి వినోదంలో గురువారం మ్యాజిక్ షో, హాస్య వినోదం నిర్వహించారు. కాకినాడ జగన్నాథపురం, విష్ణాలయం వీధిలో ఉన్న గాంధీ కమ్యూనిటీ సెంటర్‌లో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. జిల్లా బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో విజ్ఞానంతో పాటు వినోదం అందుతుందన్నారు. బలరామకృష్ణ ఇంద్రజాలం ప్రదర్శించి బాలబాలికలను మంత్ర ముగ్దులను చేశారు. వివిధ రకాల జోక్స్, పొడుపు కథలు చెప్పి పిల్లలను ఉత్సాహపరిచారు. జేవీవీ నాయకులు బీవీవీ సత్యనారాయణ, కె.ఈశ్వరరావు, సముద్ర, హరికృష్ణ తదితరులతో పాటు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

స్నేహితుని జ్ఞాపకార్థం చలివేంద్రం



కరప మార్కెట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రం


కరప: గ్రామంలోని మార్కెట్‌సెంటర్‌లో స్నేహితుని జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి, ఆటోయూనియన్ తమ అభిమానాన్ని చాటుకున్నారు. కరప గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కోలంక రమణబాబు అనారోగ్యంతో గతేడాది మృతిచెందారు. ఆయన జ్ఞాపకార్థం విజయదుర్గ ఆటోయూనియన్ ప్రతినిధులు గురువారం మార్కెట్‌సెంటర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించారు.

అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో..

కాకినాడ రూరల్: రమణయ్యపేట రాయుడు పాలెంలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. ట్రస్ట్ చైర్మన్ అడబాల రత్న ప్రసాద్, శిరీష, డాక్టర్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బతుకునావకు రాజమార్గం

- కుంభాభిషేకం రేవు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి శ్రీకారం
- రూ.149 కోట్లతో అభివృద్ధి



కుంభాభిషేకం వంతెన నుంచి కాల్వలోకి బోట్లు వచ్చే ఇరుకైన మార్గం



కుంభాభిషేకం రేవు వద్ద లంగరు వేసిన బోట్లు

కాకినాడ రూరల్: రాష్ట్రంలో పోర్టు అనుసంధానిత రహదారులు శరవేగంగా అభివృద్ధి చెంతున్నాయి. కాకినాడ కుంభాభిషేకం రేవు వద్ద ఉన్న ఫ్లై ఓవర్ నిర్మాణంతో మత్స్యకారులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా అచ్చంపేట జంక్షన్ నుంచి కాకినాడ యాంకరేజి పోర్టు వరకు 13 కిలో మీటర్ల పొడవున రూ.149 కోట్లతో నాలుగు లైన్ల రహదారిని నిర్మిస్తున్నారు. ఎన్‌హెచ్–516ఎఫ్‌గా వాకలపూడి లైట్ హౌస్ మీదుగా వెళ్లే ఈ రహదారిలో కుంభాభిషేకం రేవు వద్ద ఇరుకైన పాత వంతెన ఉంది. దీని స్థానంలో కొత్తగా వంతెనకు ప్రతిపాదించారు. ప్రస్తుతం పాత వంతెన కింద చిన్న మార్గం ఉండడంతో దుమ్ములపేటకు చెందిన మత్స్యకారులు సముద్రంలో చేపల వేట అనంతరం తమ తెప్పలు, చిన్నపాటి బోట్లను వంతెన కింద నుంచి కాల్వలోకి తీసుకువచ్చి ఒడ్డుకు చేర్చేవారు. కాకినాడ యాంకరేజ్ పోర్టుకు మెరుగైన రవాణా సదుపాయం కోసం నిర్మిస్తున్న నాలుగు లైన్ల రహదారికి కుంభాభిషేకం రేవు వద్ద ఫ్లై ఓవర్ నిర్మించేందుకు బుధవారం ఎంపీ వంగా గీత, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులు శంకుస్థాపన చేయడంతో మత్స్యకారుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. నాలుగు లైన్ల రహదారి కోసం నిర్మించే ఈ ఫ్లై ఓవర్ పెద్దగా ఉండడంతో తమ బోట్లు కాల్వలోకి తీసుకువచ్చేందుకు వీలవుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫలించనున్న చిరకాల వాంఛ

కాకినాడ దుమ్ములపేటకు చెందిన మత్స్యకారులకు సముద్రంలో చేపల వేటే జీవనాధారం. గతంలో వినియోగించే తెప్పలకు పాత వంతెన సరిపోయేది. కాలక్రమేణా వేట విస్తృతమవడంతో పెద్ద పడవలకు లంగరు వేసేందుకు ఇబ్బంది అయ్యేది. దీంతో కుంభాభిషేకం రేవు వద్దే లంగరు వేస్తున్నారు. దీంతో తుపాను సమయాల్లో, తూర్పుగాలి వీచే సమయాల్లో బోట్లు ఒకదానికి ఒకటి గుద్దుకుని దెబ్బతినేవి. దీంతో ఈ కొత్త ఫ్లై ఓవర్‌తో మత్స్యకారులకు ఎంతో ప్రయోజనం కలగనుంది.

మత్స్యకారులకు మేలు



కుంభాభిషేకం రేవు వద్ద నాలుగు లైన్ల రహదారి నిర్మించాలని గతంలో ప్రతిపక్ష నేతగా పాదయాత్రగా వచ్చిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి విన్నవించుకున్నాం. తమ విజ్ఞప్తిని గుర్తుంచుకుని నేడు సీఎంగా తమ చిరకాల కోరికకు కార్యరూపం ఇస్తున్నారు. దీని వల్ల తమ విలువైన బోట్లకు రక్షణ కలుగుతుంది.

– వాసుపల్లి కృష్ణ, మత్స్యకార సంఘ నాయకుడు, దుమ్ములపేట

వైభవంగా లక్ష్మీనారాయణ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): దేవాలయం వీధిలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణస్వామి విగ్రహ ప్రతిష్ఠ గురువారం వైభవంగా నిర్వహించారు. త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో ఈ ప్రతిష్ఠ జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు అవసరాల వేంకట రామానుజాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పళ్లంరాజు, మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి

- ఏడీసీ నాగనరసింహారావు



గృహనిర్మాణ ప్రగతిపై సమీక్షిస్తున్న ఏడీసీ నాగ నరసింహారావు

కాకినాడ: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో గృహనిర్మాణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు కోరారు. గృహనిర్మాణ ప్రగతిపై హౌసింగ్, మెప్మా, నగరపాలక సంస్థ అధికారులతో గురువారం తన చాంబర్‌లో ఈ అంశంపై సమీక్షించారు. లబ్ధిదారులైన స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.35వేల బ్యాంకు లింకేజీ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని కోరారు. కొమరగిరి, ఏపీ త్రయం, పండూరు లే అవుట్లకు సంబంధించి సుమారు 9,800 మంది ఇప్పటికే గృహనిర్మాణాలకు ఆమోదం తెలిపారని, మిగిలిన ఐదువేల మంది నుంచి అగ్రిమెంట్లు తీసుకుని పనులు త్వరగా ప్రారంభించాలన్నారు. గృహనిర్మాణ శాఖ ఈఈ, గుప్త, డీఈ కె.సత్యనారాయణరెడ్డి, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, సిటీ మిషన్ మేనేజర్ వెంకటరాజు పలువురు ఏఈలు పాల్గొన్నారు.

వలంటీర్లకు నియామకపత్రాల అందజేత

నగరపాలక సంస్థ కార్యాలయంలో కొత్తగా నియామకమైన 22 మంది వలంటీర్లకు గురువారం ఏడీసీ నాగ నరసింహారావు నియామక పత్రాలు అందజేశారు. ప్రభుత్వ పథకాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను గుర్తించడంలో బాధ్యతాయుతంగా సేవలు అందించాలన్నారు. టీపీఆర్వో మానే కృష్ణమోహన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వినియోగంలోకి జగన్నాథపురం అప్రోచ్

- ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే, కమిషనర్
- రూ.5.2 కోట్లతో నిర్మాణం పూర్తి



వంతెనను ప్రారంభిస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి, కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్, కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ శివప్రసన్న తదితరులు

కాకినాడ: జగన్నాథపురం కోటిపల్లి బస్టాండ్ నుంచి ఎన్టీఆర్ బ్రిడ్జి వరకు రూ.5.2 కోట్లతో నిర్మించిన అప్రోచ్ రోడ్డు గురువారం నుంచి వినియోగంలోకి వచ్చింది. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమా, ఇతర ప్రజాప్రతినిధులు ఈ వంతెనను ప్రారంభించారు. ఎంపీ వంగా గీత మాట్లాడుతూ ప్రజలకు అంకితం చేసిన ఈ వంతెన వల్ల కాకినాడ నుంచి కోనసీమ, రాజమండ్రి వైపు వెళ్లే వేలాది మందికి ఎంతో ప్రయోజనం అన్నారు. జాతీయ రహదారుల నుంచి స్థానిక రోడ్ల వరకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేస్తోందని, ప్రజలకు సౌకర్యవంతమైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజలకు మరిన్ని సేవలు అందించే లక్ష్యంతో 1902 ద్వారా జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు.

వంతెన పేరుతో దుష్ప్రచారం

ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు హయాంలో బ్రిడ్జి క్రిందిభాగంలో చేసిన తవ్వకాలు, తప్పుడు నిర్ణయాలు వల్ల వంతెన కుంగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యం కల్పించే క్రమంలో ప్రతి అంశాన్ని రాజకీయ లబ్ధికి వాడుకునే కొండబాబు ఈ విషయంలోను బురద చల్లేందుకు ప్రయత్నించారని మండిపడ్డారు. సొంతింటి కల సాకారం చేసేందుకు రూ.650 కోట్లను కాకినాడ ప్రజల కోసం ప్రభుత్వం వెచ్చించిందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 16 వేలు మాత్రమే ఉన్న పింఛన్లు జగన్ సీఎం అయ్యాక ఒక్క కాకినాడలోనే 25,500లకు పెరిగాయని చెప్పారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు, ఎస్ఈ పి.సత్యకుమారి, ఈఈ వెంకట్రావు, డీఈ మాధవీ, మాజీ డిప్యూటీ మేయర్లు పసుపులేటి వెంకటలక్ష్మి, మీసాల ఉదయ్‌కుమార్, చోడిపల్లి సత్యప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, మాజీ కార్పొరేటర్ నందం, తదితరులు పాల్గొన్నారు.

మోడరన్ పెంటాథ్లాన్‌లో క్రీడా ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న ముఖ్య అతిథులు డాక్టర్ చప్పిడి, దివాకర్ రెడ్డి తదితరులు

- సత్తాచాటిన జిల్లా క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్: మోడరన్ పెంటాథ్లాన్ 6వ లేజర్ రన్ రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 8, 9 తేదీలలో తిరుపతి పద్మావతిపురం జెడ్పీ హైస్కూల్‌లో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోటపాటు కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా మోడరన్ పెంటాథ్లాన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, విశిష్ట అతిథిగా క్రీడా చైర్మన్ సీహెచ్ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు. డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక దృఢత్వం పెరిగి అన్ని రంగాల్లో ముందుకు వెళ్లడానికి దోహదపడతాయని తెలిపారు. కాకినాడ జిల్లా నుంచి పాల్గొని పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. లేజర్ రన్ పోటీల్లో కాకినాడ జిల్లా బలరామపురం గ్రామానికి చెందిన పైల అనంతకుమార్ జూనియర్ విభాగంలో రెండో స్థానం, హంసవరం గ్రామానికి చెందిన దిడ్డి కృష్ణబాబు ఓపెన్ విభాగంలో 3వ స్థానం, చెక్కా శ్రీనివాస్ తాళ్లరేవు ఓపెన్ విభాగంలో 2వ స్థానం, యర్రా రాజకుమార్ గిడజం ఓపెన్ విభాగంలో మూడో స్థానం, కాకినాడకు చెందిన దీప్తి సునయన 2వ స్థానం సాధించారు. క్రీడల్లో విజయం సాధించిన క్రీడాకారులకు అతిథుల చేతుల మీదుగా పతకాలు అందజేసి అభినందనలు తెలిపారు. కాకినాడ జిల్లా కోచ్ కట్ట జగన్మోహన కిశోర్, వనుం ఉపేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కన్నబాబుతో దిశ డీఎస్పీ, నన్నయ్య వీసీ భేటీ



ఎమ్మెల్యే కన్నబాబుతో దిశ డీఎస్పీ మెహర్ జయరామ్ ప్రసాద్

కాకినాడ రూరల్: ఇటీవల డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన మెహర్ జయరామ్ ప్రసాద్, నన్నయ వర్సిటీ వీసీగా నియమితులైన కె.పద్మరాజు గురువారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబుతో భేటీ అయ్యారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో తొలుత దిశ డీఎస్పీ కన్నబాబును కలిసారు. ఈ సందర్భంగా మహిళల రక్షణకు సంబంధించి దిశ యాప్, దిశ చట్టం తదితర పనితీరును వివరించారు. అలాగే రాజానగరంలోని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ వీసీగా నియమితులైన పద్మరాజు ఎమ్మెల్యేను కలిసారు. అచ్చంపేట జంక్షన్ వద్ద ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే కన్నబాబును కోరారు.

మహాజన సోషలిస్ట్ కమిటీ ఏర్పాటు



50 డేస్ గో టు విలేజ్ కార్యక్రమంలో నాయకులు

కాకినాడ సిటీ: ఎమ్మార్పీస్, మహాజన సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 50 డేస్ గో టు విలేజ్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక జగన్నాథపురం వలందపేటలో ఆ పార్టీ నాయకులు పర్యటించి స్థానిక న్యాయకులతో సమావేశం నిర్వహించారు. పార్టీ కార్యక్రమాలను, అజెండా తదితర అంశాలను వివరించారు. పార్టీ జిల్లా కన్వీనర్ వల్లూరు సత్తిబాబు నాయకత్వంలో మహాజన సోషలిస్ట్ కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవాధ్యక్షులుగా పువ్వల సత్యనారాయణ, పలివెల రాంబాబు, ఉపాధ్యక్షులుగా మందపల్లి జాన్, పెసింగి రాజు, ప్రధాన కార్యదర్శిగా బొడ్డపాటి ప్రసాద్, కార్యదర్శులుగా పువ్వల అనిల్, కామాడి శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా మందపల్లి కమలాకర్, పువ్వల మురళి, కోశాధికారిగా పలివెల సురేష్‌లతో పాటు మరో 10 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కాకినాడ సిటీ: స్థానిక డీ1 సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ పవర్ హౌస్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ రామారావుపేట ఫీడర్ వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ జి.ప్రసాద్ గురువారం రాత్రి తెలిపారు. రామారావుపేట, సుబ్బయ్యహోటల్ ఏరియా, 3 లైట్ జంక్షన్, కొప్పెళ్ల వీధి, ఎండోమెంట్ ఆఫీస్ ఏరియా పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. అదే విధంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వెటర్నరీ హాస్పటల్ రోడ్, శేషసాయి వీధి, ప్రకాశం వీధి, గోపాలకృష్ణ వీధి, ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

సమస్యల పరిష్కారానికి శిక్షణ దోహదం



మాస్టర్ ట్రైనీల శిక్షణలో మాట్లాడుతున్న కృష్ణమోహన్

సామర్లకోట: పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణను గురువారం స్థానిక ఈటీసీలో ప్రారంభించారు. కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి ఈఓ పీఆర్డీలు, సీనియర్ పంచాయతీ కార్యదర్శులు మాస్టర్ ట్రైనీలుగా ఎంపిక అయ్యారు. గ్రామాలలోని సమస్యలపై అవగాహన లేక పోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. శిక్షణలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఒకేచోట చేరడం వల్ల సమస్యలపై చర్చించడం ద్వారా పరిష్కార మార్గం లభిస్తుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ కమిషనర్, ఈటీసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్ అన్నారు. పంచాయతీ రాజ్ చట్టాలపై అవగాహన పెంచుకుని, శిక్షణలో నేర్చుకున్న అంశాలపై ఆయా జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఇప్పటికే పంచాయతీ సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చామని, కార్యదర్శులకు కూడా శిక్షణ ఇవ్వడం ద్వారా గ్రామ పాలన సులభతరం అవుతుందని చెప్పారు. ఈటీసీ మేనేజరు పి. శ్రీనివాసరావు, ఫ్యాకల్టీలు ఎంఎస్ఎన్ రెడ్డి, వెంకటేశ్వరరావు, ప్రసాద్, కెఎస్ఆర్ నిహారికలు శిక్షణ నిర్వహించారు.

అగ్ని ప్రమాదంలో బ్యూటీ పార్లర్ దగ్ధం

తొండంగి: స్థానిక మెయిన్‌రోడ్డులో గురువారం తెల్లవారుజామున సంభవించిన అగ్నిప్రమాదంలో బ్యూటీ పార్లర్ దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. బ్యూటీషియన్ టి.జ్యోతి తన బ్యూటీ పార్లర్‌ను బుధవారం రాత్రి యథావిధిగా మూసివేసి ఇంటి వెళ్లిపోయింది. తెల్లవారుజామున షాపు నుంచి పెద్ద ఎత్తున మంటలు రావడంతో స్థానికులు గమనించి సమాచారం అందించారు. వెంటనే తుని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో పాటు స్థానికులు మంటలు అదుపుచేసే ప్రయత్నం చేశారు. అప్పటికే షాపులో ఫర్నీచర్, ఏసీ, కాస్మోటిక్స్ కాలి బూడిదయ్యాయి. రెవెన్యూ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దీనిపై సమగ్ర నివేదిక అందించాలని అధికారులను ఆదేశించినట్టు తహసీల్దార్ సుబ్రహ్మణ్యం తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లనే ఈ ప్రమాదం జరిగిందని, సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు.

పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతే లక్ష్యం

- ఆరు బృందాలతో సర్వే
- పర్యవేక్షించిన కమిషనర్



సర్వే తీరును పర్యవేక్షిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ: ప్రజారోగ్య పరిరక్షణలో కీలకపాత్ర వహించే పారిశుధ్య కార్మికుల ఆరోగ్య సంరక్షణ దిశగా ఆరు బృందాలతో మూడు రోజులపాటు నగరపాలక సంస్థ యంత్రాంగం ప్రత్యేక సర్వే నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన సర్వే ప్రక్రియను కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ గురువారం పర్యవేక్షించారు. కార్మికులకు విధి నిర్వహణలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను అధిగమించేందుకు తీసుకోవలసిన సంరక్షణ చర్యలపై సర్వే చేస్తున్నారు. కమిషనర్ సూచన మేరకు ఈ బృందాలు గురువారం నుంచి శనివారం వరకు అధ్యయనం చేయనున్నాయి. వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న సుమారు 1200 మంది రెగ్యులర్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ పర్యవేక్షణలో ముగ్గురు కమ్యూనిటీ మెడిసిన్ పీజీలతో ఒకొక్క బృందం చొప్పున ఆరు బృందాలు క్షేత్రస్థాయిలో సర్వే చేసి కమిషనర్‌కు నివేదిక ఇవ్వనున్నారు.

కమిషనర్ సందర్శన

కాకినాడ సంజయ్‌నగర్ ప్రాంతంలోని శాగ్రిగేషన్ కాంప్లెక్స్‌లో ప్రారంభించిన సర్వేను కమిషనర్ పరిశీలించి వైద్య బృందానికి పలు సూచనలిచ్చారు. నివేదిక ఆధారంగా కార్మికులకు మెరుగైన వైద్యసేవలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు కార్యాచరణను సిద్ధం చేస్తామన్నారు. ఆయన వెంట ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

స్థానిక కొండయ్యపాలెం ఫ్లై ఓవర్, చీడీలపోర వద్ద నిర్మించిన 80 అడుగుల రహదారిని అనుసంధానం చేసే ప్రాంతంలో జంక్షన్ అభివృద్ధికి ప్రతిపాదనలు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కాకినాడ నగరంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. మిలటరీ రోడ్డు ప్రాంతంలో జంక్షన్ అభివృద్ధికి సంబంధించి ఆ ప్రాంతాన్ని సందర్శించగా ఎస్ఈ పి.సత్యకుమారి, డీఈ సుబ్బారావు, డీసీపీ హరిదాసు పనుల ప్రగతిని కమిషనర్‌కు వివరించారు. అంతకు ముందు రేచర్లపేట రైల్వే ట్రాక్‌ను అనుకుని మేజర్ డ్రైన్‌లో పూడికతీత పనులను, వార్ఫ్ రోడ్డు బీఎస్ఎన్ కార్యాలయం సమీపంలో నిర్మిస్తున్న పంపింగ్ స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించారు. డీఈలు మాధవి, శ్రీనివాస ప్రసాద్, ఏఈలు వై.నాగేశ్వరరావు, సతీష్ పాల్గొన్నారు.

వచ్చేనెల 11న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

తుని రూరల్: మండలంలోని హంసవరం ఆదర్శ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో చేరేందుకు జూన్ 11న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పద్మజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022–23లో ఐదో తరగతి చదువుతూ పై తరగతికి అర్హత సాధించిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు 2011 సెప్టెంబర్ ఒకటి నుంచి 2013 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2009 సెప్టెంబర్ ఒకటి నుంచి 2013 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. ప్రవేశపరీక్ష జూన్ 11న ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 30 మార్కులు సాధించాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోగా సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 70329 96442 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తుని: పాయకరావుపేట ప్రభుత్వ ఐటీఐలో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ గురువారం తెలిపారు. అభ్యర్థులు సర్టిఫికెట్స్‌తో ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో జూన్ 6వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ కోసం పదో తరగతి మార్కుల లిస్టు, కుల ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, మొబైల్ నంబర్ అవసరమవుతాయని చెప్పారు. ధ్రువపత్రాల పరిశీలన, కౌన్సెలింగ్ తేదీలను త్వరలో తెలియజేస్తామన్నారు. దరఖాస్తు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సౌకర్యం ఉందని ప్రిన్సిపల్ వివరించారు.

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో 2023–24 సంవత్సరానికి గాను మొదటి విడత ప్రవేశానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎల్ఈఆర్ కృష్ణన్ గురువారం తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, సివిల్ ట్రేడ్లకు సంబంధించి అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు దారులు తమ యూనిక్ ఐడీ నంబర్, ఒరిజినల్ సర్టిఫికెట్లను ఐటీఐలో పరిశీలన చేయించుకుని ప్రిన్సిపల్ ఆమోదం పొందాలన్నారు.

వడగాడ్పులపై అప్రమత్తం

కోటనందూరు: వడగాడ్పుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ విస్తరణాధికారి జి. అరుణ్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని కాకరాపల్లి ఇటుక బట్టీల్లో కార్మికులు, ఉపాధిహామీ పని ప్రాంతాల్లో కూలీలతో ఆయన మాట్లాడారు. తుపానుల ప్రభావంతో వచ్చే వారం రోజుల్లో భారీగా వడగాల్పులు వీచే అవకాశం ఉందన్నారు. పని సమయంలో తెల్లని దుస్తులు ధరించాలని, తలకు రక్షణ ఏర్పాటు చేసుకోవాలన్నారు.